నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | జనవరి 18, 2023 | www.navatelangana.com

క్యాలెండర్ ఆవిష్కరించిన విద్యాశాఖధికారి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత బుధవారం పట్టణంలోని డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. అందరూ ఉపాధ్యాయుల సమస్యలపై డీఈఓకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు చౌహాన్ దేవిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక పొచ్చన్న, రాష్ట్ర నాయకులు సోమ శ్యాంసుందర్, జావిద్, రాష్ట్ర మాలి సంఘ అధ్యక్షుడు సుకుమార్ పాల్గొన్నారు.

సర్పంచుల పదవీకాలం పెంచాలి

నవతెలంగాణ-నిర్మల్



ఈ నెల చివరి తేదీతో సర్పంచుల పదవి కాలం ముగుస్తున్న సందర్భంగా పదవీ కాలాన్ని పెంచాలని సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశీష్ సాంగ్వనికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ మాట్లాడారు. గత ఏడాదిన్నర నుంచి ఎస్ఎఫ్సీ నిధులను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు జమ చేయడం లేదని అన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆయా గ్రామాల సర్పంచులున్నారు.

నిక్షిప్తం సమాప్తం..!

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం ముగిసింది. సుమారు పక్షం రోజుల పాటు చేపట్టిన ఈ క్రతువు బుధవారంతో సమాప్తమైంది. ప్రత్యేకంగా కేటాయించిన సిబ్బంది ఈ దరఖాస్తులను ఎప్పటికప్పుడు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ప్రజాపాలన పేరిట ప్రభుత్వం ఐదు గ్యారెంటీల కోసం స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం ముగిసిపోవడంతో ఇక వాటిని అమలు చేయడమే తరువాయిగా మారింది. ప్రజాపాలనకు ఉమ్మడి జిల్లాలో ఏకంగా 9,99,696దరఖాస్తులు రావడం సమస్యలు ఏ మేరకు పేరుకుపోయాయో తేటతెల్లం చేస్తోంది. లక్షలాది మంది జనం దీర్ఘకాలికంగా అరకొర సౌకర్యాలు, వివిధ సమస్యలతో బాధపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీనిచ్చిన ఐదు గ్యారెంటీలను అమలు చేసేందుకు ఈ దరఖాస్తులనే ప్రామాణికంగా తీసుకోవడంతో వీటికి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. జనం సైతం వీటి అమలులో ప్రభుత్వ నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

- ముగిసిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ
- ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆర్జీదారుల వివరాలు
- ఇక గ్యారెంటీల అమలుపైనే అందరి దృష్టి
- ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలనకు 9,99,696 అర్జీలు



కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగానే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించింది. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని వాగ్దానం చేసింది. వీటిని నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొలువు దీరిన వారం రోజుల్లోనే ప్రజాపాలన పేరిట గతేడాది డిసెంబర్ 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. యువ వికాసం పథకానికి తప్పితే మిగితా ఐదు గ్యారెంటీలైన మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించింది. గ్రామాలు, పట్టణాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకున్నారు. వీటితో పాటు రేషన్‌కార్డులు, ఇతరాత్ర సమస్యల కోసం సైతం వినతులు స్వీకరించారు. వీటిని అదే రోజు నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. సుమారు పదిహేను రోజుల పాటు జరిగిన ఈ క్రతువు ముగిసిపోవడంతో వాటి అమలుపైనే అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది.

ఆశగా ఎదురుచూపులు..!

ఏండ్లుగా సొంత గూడు లేక..విద్యుత్ భారం అధికం కావడంతో అనేక మంది పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో లభించకపోవడంతో కనీసం కొత్త సర్కారైనా తమ ఆకాంక్ష తీరుస్తుందని భావిస్తున్నారు. వీటితో పాటు కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆయా పథకాలు పొందాలనే ఉద్దేశంతో జనం ఆశతో ఉన్నారు. అర్జీల స్వీకరణ పూర్తికావడంతో వీటిని ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 9,99,696 దరఖాస్తులు రావడం చూస్తే సమస్యలు ఏ మేరకు పేరుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. ఆదిలాబాద్ జిల్లాలో 2,54,164, నిర్మల్‌లో 2,80,489, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 1,81,794, మంచిర్యాలలో 2,83,249 మంది దరఖాస్తులు చేశారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలవుతున్నాయి. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా రూ.10లక్షలకు వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. మిగిలిన గ్యారెంటీలను కూడా అమలు చేసే దిశగా ప్రభుత్వ యంత్రాంగం దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గృహజ్యోతి, మహిళలకు రూ.2500చొప్పున అందజేయడం, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిపై ఇప్పటికే ఉన్నతస్థాయిలో సమీక్ష జరిగినట్లు తెలిసింది. ఈ పథకాలకు విధి విధానాలు రూపొందించి వంద రోజుల్లోగా అమల్లోకి తీసుకొచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లావాసులు సైతం వీటి అమలుపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని వర్ని, కుప్టి, సిరిపెల్లి గ్రామాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో పెద్దఎత్తున చేరారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ రావ్ పాటిల్ ఆధ్వర్యంలో దాదాపుగా 200 మంది వరకు కాంగ్రెస్‌లో తీసుకొని కండువా కప్పారు. ఈసందర్భంగా వారు నారాయణరావు పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ వల్లనే ముధోల్ నియోజక వర్గం అభివద్ధి చెందుతుందని అన్నారు. బీఆర్ఎస్‌ను నమ్మి మోసపోయామని దింతో బీఆర్ఎస్ వల్ల గ్రామాలు ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారెంటీలు పక్కాగా అమలు చేసి నిరుపేద కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. అదేవిదంగా ఇండ్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కుబీర్ కాంగ్రెస్ యువ నాయకులు జావీద్ ఖాన్, సతీష్ బషీర్ ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌ను విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజ్ రియంబర్స్ మెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవిను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకంను ప్రారంభించాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.

ప్రమాదం జరిగే వరకు స్పందించరా..?



నవతెలంగాణ-నస్పూర్

రహదారిపై రోడ్డు మధ్యలో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని సంఘం మల్లయ్య పల్లె, శ్యామ్‌నగర్ నుండి శ్రీరాంపూర్ ఏరియా బస్టాండ్‌కు వెళ్లే దారిలో రోడ్డుపై గుంత ఏర్పడి ఇనుప రాడ్లు బయటకు వచ్చాయి. నిత్యం ఈ రోడ్డుపై సామాన్య ప్రజలే కాకుండా సింగరేణి కార్మికుల సైతం కొంత మంది ఎస్ఆర్‌పీ3, 3ఏ, ఎస్ఆర్‌పీ1 గనులకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఎస్ఆర్‌పీ3, 3ఏ గనిలో బొగ్గు ఉత్పత్తి సమయంలో బ్లాస్టింగ్‌కు వాడే మందు గుండు సామాగ్రిని(గుట్కు) ఇదే దారి గుండా తీసుకెళ్తారు. గుంతపడి రాడ్లు తెలిన విషయం అధికారులు గుర్తించకపోవడం శోచనీయం. ప్రమాదం జరిగితే కానీ స్పందిచేలా అధికారులేరు అంటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని ప్రమాదాలు జరగకముందే మరమత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

లక్షెట్టిపేట బస్టాండ్‌లో దొంగల హల్చల్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని బస్టాండ్‌లో దొంగలు హల్చల్ చేశారు. దొంగలు వారి చేతి వాటం చూపించి ఒకే రోజు ఇద్దరి పర్సులను తస్కరించారు. బుధవారం సాయంత్రం మంచిర్యాల వెళ్లడానికి బస్ కోసం వేచి ఉండగా చాతరాజు దుర్గయ్య, సిలువేరి రమేష్‌ల పర్సులు కాజేశారు. అందులో ముఖ్యమైన కార్డులు, డబ్బులన్నీ అందులోనే ఉన్నాయని బాదితులు వాపోయారు. పర్సులోని కార్డులు దొరికితే సిలువేరి రమేష్ 9959677383, చాతరాజు దుర్గయ్య8247286657 నంబర్లకి సంప్రదించాలని బాదితులు కోరుతున్నారు.

జాతరకు ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని సాలేవాడ(కె) మహదేవ్ జాతరకు రావాలని డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి బుధవారం ఆహ్వాన పత్రికను అందించారు. సాలేవాడ(కె) గ్రామ ప్రజలు ఎంపీటీసీ రవీందర్, తులసిరాం, రామదాస్, రవీందర్ ఉన్నారు.

జోగురామన్న అవినీతి బాగోతం బయటపెడ్తాం

- డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి తీవ్ర విమర్శలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అవినీతి చరిత్రను ఎపిసోడ్ల వారిగా బయటపెడ్తామని డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. తాను డబ్బులు తీసుకొని కాంగ్రెస్‌లో చేరానని ఆయన ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండించారు. బుధవారం కంది శ్రీనివాస రెడ్డి ప్రజా సేవాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవి, అధికారం కోల్పోవటంతో రామన్న మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లోకొచ్చేముందు జోగురామన్న ఆస్తులెన్ని, తన ఆస్తులెన్నో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. అసలు జోగు రామన్న రాజకీయాల్లోకొచ్చిందే డబ్బు సంపాదనకోసమని విమర్శించారు. రిమ్స్‌లో అడ్డగోలుగా ఉద్యోగాలమ్ముకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆయన సొంత ఊరు దీపాయి గూడలో హన్మాన్ విగ్రహం ముందు తాను కంది శ్రీనివాసరెడ్డి నుంచి డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తానని ఆయనకు దమ్ముంటే తీసుకున్నట్టు ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. నీ చరిత్రేంటి, నా చరిత్రేంటో ప్రజలకు బాగా తెలుసునన్నారు. కాంట్రాక్టు ఉద్యోగాలు, ప్రభుత్వోద్యోగుల ట్రాన్సఫర్లలో రూ.లక్షలు తీసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. పార్టీ మారేముందు పదవులు త్యజించాలని ప్రశ్నించే నైతిక అర్హత నీకుందా అని అన్నారు. సహకార సంఘాల పదవులు పార్టీ గుర్తుతో కాదు, రైతుల ఓట్లతో వచ్చినవని సమాధానమిచ్చారు. మేం కేవలం అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరాను తప్ప డబ్బులకోసం కాదని తేల్చి చెప్పారు. డబ్బుల కోసం రాజకీయాలు చేసే చరిత్ర నీదని దుయ్యబట్టారు. జోగురామన్నకు దమ్ముంటే తనపై అవిశ్వాసం పెట్టాలని సవాల్ చేసారు. ఏమీ లేని తనకు ఇపుడు 5,6 వందల కోట్ల ఆస్తులెక్కడినుండొచ్చాయో సమాధానం చెప్పాలన్నారు. అప్పట్లో రెండు కోట్లిస్తేనే బీఆర్ఎస్‌లో చేరుతానని కేసీఆర్‌ను డిమాండ్ చేసింది నిజం కాదా రామన్న అని ఎద్దేవా చేసారు. అభివృద్ధి కోసం పార్టీ మారిన తమను టచ్ చేసి చూస్తే కరెంట్ షాక్‌లు తగుల్తాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు జంగుపటేల్, భోజారెడ్డి(రాంపూర్), సీనియర్ నాయకులు మునిగెల విఠల్, సయ్యద్ సుజాత్ అలీ, శ్రీనివాస్, ఎండీ రఫీఖ్, శంకరయ్య, లింగన్న, ఎంఎ.షకీల్ పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ-హాజీపూర్



చదువుకోవాలని తండ్రి మందలించడంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నంనూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో చోటు చేసుకుంది. హాజీపూర్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నంనూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి సాగర్(19) మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నెల రోజులుగా కాలేజీకి వెళ్లడం లేదు. బుధవారం ఉదయం తండ్రి సుధాకర్ మందలించాడు. మేస్త్రి పని చేసే తల్లిదండ్రులు పని నిమిత్తం మంచిర్యాలకు వెళ్ళారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకి చీరతో ఉరేసుకున్నారు. గమనించి కూతురు హర్షిత తల్లిండ్రులకు సమాచారం అందిచ్చింది. వారు వచ్చి చూసే సరికి మరణించి ఉన్నాడు. తండ్రి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదుకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

అక్రమంగా బండ రాయిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ శివారులోని నర్సింగరావు చెరువు సమీపంలో ఉన్న గుట్టలను తవ్వి అక్రమంగా ట్రాక్టర్లలో బండను తరలిస్తున్నారని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం అక్రమంగా బండ రాయిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బోజన్నకు వినతిపత్రం అందించారు. ఈ సంధర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏజన్సీ గ్రామంలో గుట్టలను తవ్వద్దని పలుమార్లు చెప్పినా వినకుండా అక్రమంగా ట్రాక్టర్లలో బండ రాయిని తరలిస్తున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయిసిడాం రమేశ్, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, కార్యదర్శి మేంద్రపు రాజన్న, పెంద్రం రాజశేఖర్, పెంద్రం శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలం కేంద్రంలో బుధవారం ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు చేరారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో పదవులనుభవించిన కొందరు ఎన్నికల సమయంలో ద్రోహం చేశారని ఆరోపించారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఓటమికి ఆ నలుగురు ద్రోహులే కారణమని దుయ్యబట్టారు. తనను ఓడగొట్టేందుకు జోగు రామన్న చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. ఓటమి కొంత బాధకలిగించినప్పటికీ ఎన్నికల ఫలితాలతో సంబంధంలేకుండా ఇకపై తన జీవితమంతా ప్రజలతోనే, ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. తనకోసం, పార్టీ కోసం కష్టపడ్డ ప్రతీ నాయకుడికి, కార్యకర్తకూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. గత ఐదు ఎన్నికలకంటే ఈ మారు తనకు కాంగ్రెస్ అభ్యర్థిగా అత్యధిక ఓట్లొచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో చేరుతున్న వారు డబ్బుల కోసమే పార్టీ మారుతున్నారని జోగు రామన్న ఆరోపణలు నిరాధారమని కొట్టిపారేశారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి 20 వేలకు తగ్గకుండా మెజారిటీ ఇద్దామన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. వైద్యసేవల కోసం రిమ్స్‌లో ప్రత్యేకంగా ఇద్దరు కార్యకర్తలను అందుబాటులో ఉంచామని, హైదరాబాద్‌లో మరొకరున్నారని తెలిపారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జడ్పీటీసీ అరుంధతి వెంకటొరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ జంగు పటేల్ పాల్గొన్నారు.

జీపీఎఫ్ చెక్కులను పాస్ చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



జీపీఎఫ్ లోన్, పార్ట్ ఫైనల్ చెక్కులను వెంటనే పాస్ చేయలని జడ్పీ సీఈఓ సుదీర్‌కు టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్‌లు మాట్లాడారు. గత ఆరు నెలలుగా ఉపాధ్యాయులకు చెక్కులు పాస్ కాకపోవడంతో అత్యవసరం ఉన్నవారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా నాయకులు బక్కన్న, రవికుమార్, భూమన్న, గణపతి ఉన్నారు.

నాగోబాను దర్శించిన ఎస్పీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని ఎస్పీ గౌస్ ఆలం బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు పటేల్ వెంకట్ రావ్, పూజారి శేకు ఆధ్వర్యములో ఆయనకు శాలువతో ఘనంగా సన్మానించారు. నాగోబా చరిత్రను మెస్రం వంశీయులు వివరించారు. అనంతరం జాతర ఏర్పాట్లపై స్థానిక పోలీసులతో అడిగి తెలుసుకున్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30 రోజులు ఉంటుందని అన్నారు. దీనికి ఫీజు రూ.15,600 ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7382840349 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మెరుగైన సమాజం కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ల ఆదేశానుసారం సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. నూతన ఓటర్లు, యువఓటర్లు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల్లోని బీఎల్‌ఓలు నూతన ఓటరులకు చైతన్యం కల్పించి ఓటరు నమోదు పక్రియ దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, డిప్యూటి తహసీల్దార్ వి.గంగాధర్, వరల్డ్ విజన్ సంస్థ మేనేజర్ బ్రహ్మయ్య రెవిన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు, యువకులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తే సహించం

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రజలను మోసం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోబిన్‌పుర కాలనీలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షులు ఇమ్రాన్‌తో పాటు మైనార్టీ పెద్దలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందన్నారు. త్వరలో ఆరు గ్యారంటీలు ప్రతి ఇంటికి చేరుతాయని అన్నారు. పథకాల పేరిట ఎవరైన మోసం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



రాష్ట్రస్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు



నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని కేబి కాంప్లెక్స్ క్రీడా మైదానంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు సోయం బాపురావు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వెంకట్ నరసింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి నవీన్ నికోలస్, జిల్లా ఎస్పీ గౌస్ ఆలమ్, పీఓ చాహత్ బాజ్‌పాయ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అతిథులు విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు క్రీడా రంగాలలో రాణిస్తూ, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా రంగాలలో రాణించి, పతకాలు సాధించాలని అన్నారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఆటలతో పాటు చదువులోను రాణించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించడంతో క్రీడాకారులు ఒలంపిక్స్, ఆసియన్ వంటి గేమ్స్‌ల్లో 200 పైగా పతకాలు సాధించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రాలలో ఖేలో ఇండియా వంటి పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు అవసరమైన వసతులు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్‌లో పాల్గొంటున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1022 గురుకుల విద్యాసంస్థలలో విద్యనభ్యసిస్తున్న 5 వేల మంది వివిధ క్రీడా పోటీలలో పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు వికాసం, ఆరోగ్యం కోసం ఇలాంటి స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు భోజన వస్తతులు కలిపిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి, నీట్‌లలో ర్యాంక్‌లు సాధిస్తున్నారని, అలాగే క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకువస్తున్నారని అన్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు మెనూ ప్రకారం భోజనం అందిస్తూ, ప్రత్యేక కోచ్‌లను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్పోర్ట్స్ లీగ్ కార్యక్రమంలో పాల్గొంటున్న క్రీడాకారులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ గేమ్స్ తన చిన్ననాటి రోజులను గుర్తు చేస్తుందని, కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు. పీఓ మాట్లాడుతూ, 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్, ఆర్చరీ వంటి క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 4 రోజులపాటు నిర్వహించే క్రీడాపోటీలలో పాల్గొంటున్న విద్యార్థులు, కోచ్, సిబ్బందికి అవసరమైన వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల వికాసం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రీడాపోటీలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, దేనినైనా సమానంగా తీసుకొని జీవితంలో విజయాలు సాధించాలని కోరారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరూ విజేతలేనని పీఓ పేర్కొన్నారు. బోథ్ ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా రంగాలలో రాణించే విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీలను జెండా ఊపి ప్రారంభించి, 800 మీటర్ల రన్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెడల్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న రైల్వే సాధన కమిటీ రిలేదీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని చేపట్టిన రిలేదీక్షలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఆదిలాబాద్‌కు చెందిన ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగ, వర్తక, వాణిజ్య, ప్రజాసంఘాల ప్రతినిధులు. తమ చిరకాల వాంఛ నెరవేర్చుకునే క్రమంలో రిలే నిరాహారదీక్షలతో పోరాటాన్ని ఉధృతం చేస్తున్నారు. అందులో భాగంగా దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ రైల్వేలైను నిర్మాణాన్ని కేంద్రం దశాబ్దాలుగా నాన్చుతోందని అన్నారు. ఇది పూర్తి అయితే ఈ ప్రాంతానికి విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు ఎంతో మేలుకలుగుతుందని పేర్కొన్నారు. వెంటనే ఈ విషయమై కేంద్రం దృష్టి సారించి, జిల్లావాసుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బేల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, సాత్నాల ప్రాజెక్ట్ మాజీ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి, నాయకులు మానే శంకర్, రూపేష్‌రెడ్డి, దీపక్‌రావు, మహమూద్, హరీష్‌రెడ్డి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

● ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-ముధోల్

క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరదారుఢ్యం పెంపొందుతుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో ముధోల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. యువకులు క్రీడలతో పాటు చదువుల్లో రాణించాలన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడ స్ఫూర్తిని కలిగి ఉండాలని సూచించారు. ఫైనల్ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మదీనా జట్టుకు మొదటి బహుమతి రూ.11వేల111 నగదు, షీల్డ్, రన్నరప్ జట్టుకు రూ.6వేల 666 నగదు, షీల్డ్ బహుమతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దేవోజి భూమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జ్ తాటివార్ రమేష్, నాయకులు మదన్, ధర్మపురి శ్రీనివాస్, దశరత్, భూషణ్, గంగాధర్ పాల్గొన్నారు.

మైనర్‌లను పనిలో పెట్టుకోవద్దు

● జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి



నవతెలంగాణ-ఖానాపూర్

14 సంవత్సరాలు వయసు పూర్తికాని చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం నిషేధమని బాలల సంరక్షణ జిల్లా అధికారి దేవి మురళి అన్నారు. బుధవారం ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని తిమ్మాపూర్, సాయినగర్ కాలనీ, మస్కపూర్, ఇక్బాల్‌పూర్ గ్రామంలోని సిమెంట్ బ్రిక్స్, ఇటుకబట్టీలు తదితర ప్రదేశాలను స్మైల్ బృందం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలు పనిచేస్తున్నారని ఆరాతీశారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి దేవి మురళి మాట్లాడుతూ యజమానులకు బాలకార్మిక చట్టాల గురించి వివరించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే జరిగే పరిమాణాల గురించి తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. 14 సంవత్సరాలు పూర్తికానీ పిల్లలని ఎక్కడ కూడా పనిలో పెట్టుకోకూడదన్నారు. 15 నుంచి 18 సంవత్సరాలు పూర్తికాని పిల్లలను ప్రమాదకరమైన పనిలో ఎక్కడ కూడా పెట్టుకోకూడదని అన్నారు. బాల కార్మికులు ఎక్కడ కనిపించిన ఈ 1098 నెంబర్‌కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డివిజన్ స్మైల్ టీం ఇన్‌చార్జి ఎస్సై అశోక్, టీమ్ చిన్నయ్య, షౌకత్, నరేష్, వజ్రమ్మ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ నల్ల గంగాధర్, చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ సుప్రియ, నవీన్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డును వ్యతిరేకిస్తూ రైతుల ఆందోళన



బేల ప్రధాన రహదారిపై దర్నా చేస్తున్న రైతులు

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని అంతర్ రాష్ట్ర రోడ్డుపైన బుధవారం రైతులు రోడ్డెక్కారు. అంతర్ రాష్ట్ర రహదారి 353 బేల మండల కేంద్రం నుంచి బైపాస్ దాదాపుగా 4.50 కిలోమీటర్లు వెళ్తుంది. ఈ బైపాస్ గుండా భూములు కోల్పోతున్న, శంషాబాద్, డోప్టాల, మొహబత్‌పూర్ రైతులు రోడ్డుపైన రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాలుగు వరుసల రహదారికి తాము అడ్డుకోమని, కానీ ఎక్కడి నుంచి ఈ రహదారి ప్రారంభమైందో ఆ ప్రాంతాల్లో ఎక్కడ కుడా బైపాస్ ఊసే లేదు. కేవలం బేల మండలానికి వచ్చే సరికి బైపాస్ రోడ్డును చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ఉండే రైతులు చిన్న, సన్న కారు రైతులమని, మా జీవనాదారం వ్యవసాయమని అన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు బైపాస్ రోడ్డు వేస్తే తమ బంగారు భూమలు కోల్పోయి ఆర్థికంగా చాలా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది సన్న, చిన్న కారు రైతులు వ్యవసాయ భూమి పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. ఏది ఏమైనా బైపాస్ రోడ్డుకు తమ భూములను ఇవ్వబోమని రైతులు తెలియజేశారు. అవసరమైతే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఒళ్లఫ్‌వార్ దేవన్న, విపిన్ ఖోడే, విశ్వనాథ్, రామారావు, నందు అమిడ్‌వార్, అనిల్, ఖోడే సచిన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని స్థానిక హరిత రిసార్ట్‌లో 2003-2004 వ సంవత్సర పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. గురువులను సన్మానించారు. గడిచిన కాలం ఎంతో విలువైనదని, స్నేహబంధం ఎంతో పవిత్రమైనదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

'కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదు'




సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నూతన్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్

ఇండ్ల స్థలాలకై పోరాటాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి అన్నారు. బుధవారం ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో లక్షకు పైగా గుడిసెలు వేసి ఇండ్ల స్థలాలు లేని పేదల కోసం గూడు కల్పించడం కోసం సీపీఐ(ఎం), ప్రజా సంఘాలు నిర్వహిస్తున్నటువంటి పోరాటాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతూ నాన్ బెయిలేబుల్ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని జిల్లా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కమీటీ వ్యతిరేకిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలాన్ని ఇస్తామని చెప్పినటువంటి కాంగ్రెస్ జగిత్యాల, కోరుట్ల కేంద్రంగా రెండు మూడు నెలలుగా జరుగుతున్నటువంటి భూపోరాటాలను అనచివేసేందుకు సీపీఐ(ఎం) నాయకుల పైన, ప్రజాసంఘాల నాయకులు పైన నాన్ బెయిలేబుల్ కేసులు పెట్టిందని అన్నారు. వెంటనే వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని పేదలకు ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నిర్మల్ మండల కార్యదర్శి చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని రేవోజిపేట గ్రామానికి చెందిన గడ్డం రాదా(50) గత ఆరు నెలల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించింది. వారిది నిరుపేద కుటుంబం కావడంతో, గ్రామస్తులంతా కలిసి వారికి కావాల్సిన వంట సరుకులు, రూ. 25వేల నగదును అందించారు. ఇందులో మంతెన సత్యనారాయణ, కొక్కొండ రవి, నస్పూరి రాకేష్, అర్కుల రాకేష్, కొక్కొండ మధు, నేరెళ్ల రమేష్, కోల మహేష్, ప్రభాకర్‌ను పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-ముధోల్

పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ బుధవారం ముధోల్ మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీఓ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్ బిల్లులు ఈ నెల 31లోపు చెల్లించాలన్నారు. తమ పదవీ కాలం ముగుస్తుండటంతో తమ పదవీ కాలాన్ని పెంచాలని, అదేవిధంగా పర్సన్ ఇన్‌ఛార్జీగా సర్పంచ్లను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్



గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీ సోయం బాపురావును నార్నూర్ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు యుర్వేత రూపదేవ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామపంచాయతీల్లో అమలు పరిచేలా కృషి చేయాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వారి వెంట వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు సుజాత పరమేశ్వర్, కళావతి ఉత్తం ఉన్నారు.

సీఐటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



సీఐటీయూ క్యాలెండర్లను ఆర్డీఓ కషబోయిన సురేష్ ఆవిష్కరించారు. బుధవారం సీఐటీయూ నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కార్మికుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేల చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, నాయకులు ముంజం ఆనంద్ కుమార్, హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షులు అలవాల చంద్రయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని గుండి వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. బుధవారం వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనుల్లో అలసత్వం వహించవద్దని, నాణ్యతతో వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ వర్షాకాలంలోపు వంతెన పనులను పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గుండి మాజీ సర్పంచ్ శేండే దత్తు, వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, ఈదులవాడ సర్పంచ్ బూసి భీమేష్, మల్లేష్, సత్తి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కాంబ్లే బాలాజీ, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి బెల్లంపల్లి శ్రీనివాసులు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మందకృష్ణ పోరాడుతున్నారన్నారు. దీనికి సంబంధించి బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వస్తుందని తెలిపారు. తీర్పు ఏ విధంగా వచ్చిన అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు. దీనికోసం క్షేత్రస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. గ్రామ కమిటీలు బలోపేతం చేయాలని సూచించారు. కమిటీల నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల రమేష్, ఎంఎస్‌పీ నాయకులు రేగుంట సాగర్ పాల్గొన్నారు.

కుటికెలా శంకర్‌కు సతీవియోగం



నవతెలంగాణ-జైనూర్

గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుటికెలా శంకర్‌కు సతీవియోగం కలిగింది. కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ ఆయన భార్య భూలక్ష్మీ(40) బుధవారం మృతి చెందింది. ఆమె రక్త హీనతతో బాధపడుతుండగా చికిత్స చేయించారు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా కేవలం ఎనిమిది గ్రాముల రక్తం ఉండడంతో చికిత్స చేయించారు. బుధవారం తెల్లవారు జామున మృతిచెందినట్టు కుటికెలా శంకర్ తెలిపారు. విషయం తెలుసుకున్న పేదల గ్రామీణ సంఘం జిల్లా నాయకులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌తో పాటు పలువురు ప్రముఖులు అంతక్రియల్లో పాల్గొన్నారు.

మైనారిటీలో ప్రవేశానికి దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 విద్యా సంవత్సరానికి మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసిఫాబాద్‌లోని బాబాపూర్ (బాలికలు), కాగజ్ నగర్(బాలురు 1, 2)లలో 5వ తరగతిలో నూతన అడ్మిషన్లు, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న మైనారిటీ సీట్ల భర్తీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రవేశానికి అర్హులైన మైనారిటీలు(ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్సీలు) ఈనెల 18వ తేదీ నుండి ఫిబ్రవరి 6వ తేదీలోగా ఆన్‌లైన్ టీఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాలకు మైనారిటీ గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

నవతెలంగాణ-జైనూర్

పత్తి నిల్వలు పెరిగిన కారణంగా మండలంలోని మార్కెట్ యార్డులో మూడు రోజుల పాటు సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ హైమద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెండు జిన్నింగు మిల్లుల్లో పత్తి నిల్వలు పెరిగాయన్నారు. స్థలం లేని కారణంగా పత్తి కొనుగోళ్లు మూడు రోజుల పాటు నిలిపివేస్తునానమని తెలిపారు. శనివారం పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు సహకరించాలని కోరారు.

ప్రతి ఇంటి గోడపై శ్రీరామ నామం ప్రచురణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభం కానున్న నేపథ్యంలో హిందూ వాహిని సభ్యుడు కరణ్ నేతృత్వంలో జిల్లా కేంద్రంలో ప్రతి ఇంటి గోడపై శ్రీరామ నామం ప్రచురిస్తున్నారు. హర్ ఘర్ రామ నామ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి గోడపై శ్రీరామ నామం ముద్రలు వేస్తున్నట్లు తెలిపారు. రామ మందిరం ప్రారంభోత్సవంలో ప్రతి హిందువు పాల్గొనాలని కోరారు.

క్రికెట్ విజేత ఇందాని జట్టు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందాని గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో ఇందాని జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంటుకు ముఖ్య అతిథిగా హాజరైన తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్‌కుమార్ హాజరై విజయం సాధించిన జట్టుకు మొదటి బహుమతి రూ.6100 వేలు, ద్వితీయ బహుమతి వాసు డీజే కిర్డీ జట్టుకు రూ.3100 వేలు అందజేశారు. యువత ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొంటూ తమలోని నైపుణ్యాలను వెలికి తీసుకోవాలని అతిథులు సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి టోర్నమెంట్‌లను మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు.

డ్రైవర్ల పోరాటానికి అండగా ఉంటాం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి
- ప్రధాన రహదారిపై రాస్తారోకో



డ్రైవర్ల ఆందోళనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-జైనూర్

హిట్ అండ్ రన్ కేసుల్లో కేంద్రం తీసుకువచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేసే వరకు డ్రైవర్ల పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. వారి ధర్నాకు ఎమ్మెల్యే మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యాక్సిడెంట్ కేసుల్లో తీసుకొచ్చిన నూతన చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేద ప్రజలకు అన్యాయం చేసేలా చట్టాలను తీసుకొస్తుందని ఆరోపించారు. పేద కుటుంబాలకు చెందిన వారే వాహనాలను నడుపుతూ కుటుంబాలను పోషించేందుకు డ్రైవర్లుగా పనిచేస్తున్నారన్నారు. కానీ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం పార్లమెంటులో డ్రైవర్ల ద్వారా ప్రమాదం జరిగితే వారికి రూ.7 లక్షల జరిమానా, ఏడేండ్ల జైలుశిక్ష విధించేలా నిబంధనలు తీసుకురావడం సరికాదన్నారు. డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం డ్రైవర్లు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. రాస్తారోకో అర గంటకు పైగా సాగడంతో వాహనాలు ఇరువైపుల నిలిచి పోయాయి. ఈ సందర్భంగా జైనూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో ప్రత్యేక భోజనాలు చేశారు. డ్రైవర్‌లకు మేమున్నామనే భరోసా కలిపిస్తూ వారితో కలిసి అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మెన్ కనక యాదవరావు, సహకార సంఘం చైర్మెన్ కొడప హన్నూపటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, ఎంపీటీసీ-2 బీబీనూర్, నాయకులు అజ్జులాల, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, సర్పంచ్ మెస్రం పార్వతి లక్ష్మణ్, ఇంతియాజ్ ఖాన్, ఉపాధ్యక్షుడు అయాజ్, డ్రైవర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలి

నవతెలంగాణ-కౌటాల

యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలని సీఐ సాదిక్‌పాషా అన్నారు. బుధవారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా క్రీడలు, ఉన్నత చదువులు, ఉద్యోగ సాధనలపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల్లో ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి క్రీడల్లో పాల్గొన్నప్పుడే వారిలోని ప్రతిభ బయటకు రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. యువత తమ సమయాన్ని చెడు వ్యసనాలపై పెట్టకుండా ఇలా క్రీడలు, చదువు, ఉద్యోగాల సాధనపై పెట్టాలన్నారు. యువతకు పోలీసులు అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత స్థానాలు, ఉద్యోగ సాధనలో ఉన్న అభ్యర్థులకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పించేందుకు పోలీసులు ఎల్లవేళల సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో ఆడారన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపే లక్ష్యంగా ఆడడం జరిగిందని, ఓడిన క్రీడాకారులు నిరుత్సాహపడకూడదన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపుకు పునాది కావాలన్నారు. 60 కిలోల బరువు పోటీల్లో మొదటి స్థానం మొగడ్‌దగడ్, రెండవ స్థానం ఈస్‌గాం, మూడో స్థానం వీర్దండి, అదేవిధంగా 50 కిలోల బరువు పోటీల్లో మొదటిస్థానం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా వేడ్‌గావ్, రెండవ స్థానం టోంకిని, మూడవ స్థానం తాటిపెల్లి గ్రామాల టీంలు గెలుపొందాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.21,111, రెండవ బహుమతి రూ.11,111, మూడవ బహుమతి రూ.5,111ల నగదుతో పాటు షీల్డులను అందజేశారు. బెస్ట్ రైడర్‌గా రోషన్ మడావి, బెస్ట్ డిఫెండర్‌గా మోహిత్ నికాడేకు రూ.2500 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వత్ జీజాబాయి, ఉప సర్పంచ్ బదన్ కల్పన, ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, కార్యదర్శి శ్రావణి, మహేష్, బీజేపీ మండల అధ్యక్షుడు వానుపటేల్, ఏర్మ సుధాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సీఐ సాదిక్‌పాషా

సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ బొర్కాడ హేమంత్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమ సమాజ నిర్మాణానికి కేవీపీఎస్ లాంటి సంఘం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్ అన్నారు. కేవీపీఎస్ 2024 క్యాలెండర్‌ను జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమ సమాజం సాధ్యమైనప్పుడే అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు అందుతాయన్నారు. అటువంటి దాని కోసం కేవీపీఎస్ లాంటి సంఘాలు కృషి చేయాలని సూచించారు. సమాజంలో ఎంతో మార్పు వచ్చిందని ఇంకా రావాల్సి ఉందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ సామాజిక తత్వవేత్తలు మహనీయులు మార్గదర్శకులని, ఆ మహనీయుల స్ఫూర్తితో తమ సంఘం పోరాడుతుందన్నారు. సామాజిక ఉద్యమాలు ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని, ప్రతిఘటన శక్తిని పెంపొందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ కోసం ఎస్సీ,ఎస్టీ, సబ్ ప్లాన్ చట్టం కోసం పోరాటాలు నిర్వహించామని, అదే విధంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కోసం ఉద్యమం చేసి సాధించామన్నారు. నేటికీ కొనసాగుతున్న కులవివక్ష అంటరానితనం సామాజిక అణిచివేతలకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డోంగ్రి మహేశ్వర్, మస్కే నగేష్, నాయకుల జాడి బాబాజీ పాల్గొన్నారు.

వ్యాపారంలో మహిళా సంఘాలు రాణించాలి

నవతెలంగాణ-జైనూర్

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వ్యాపారంలో మహిళాలు రాణించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. బుధవారం సిర్పూర్(యు) మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోల్డ్ ఫ్రెష్ ఆయిల్ మిల్లును జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కోల్డ్ ఫ్రెష్ ఆయిల్ మిల్లు ప్రారంభించడం గర్వకారణమన్నారు. దీని ద్వారా మండలంలో మహిళలకు ఉపాధి లభిస్తుందని, మిల్లును ప్రారంభించిన మహిళా సమాఖ్యను అభినందించారు. చిరుధాన్యాలు ఉపయోగించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్‌తో పాటు అతిథులను ఎంపీపీ, సర్పంచ్, ఐకేపీ సిబ్బంది ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఆత్రం భగవంత్‌రావు, పీఏసీఎస్ చైర్మెన్ కేంద్రె శివాజీ, సర్పంచ్ ఆత్రం వీనాబాయి, ఉప సర్పంచ్ అమీద్ ఖాన్, నాగోరావు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న సీఐ సాదిక్‌పాషా

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి : అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామపంచాయతీలలో పన్నుల వసూళ్లను నిర్దేశిత లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీఓలతో లక్ష్యాల సాధన ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉండి అర్హత గల ప్రతి కూలీకి పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్ల నిర్మాణాలు, కమ్యూనిటీ ఆస్తుల ఏర్పాటు, నర్సరీల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. గ్రామపంచాయతీల పరిధిలో మార్చి 31వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల కార్యదర్శులు పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కుమార్ హుస్సేన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి ఏరియాలో ఇంజనీరింగ్ అధికారుల పర్యటన



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో జీఎం (ఈఅండ్ఎం) సీహెచ్‌పీ నవీన్ గోలేటి సీహెచ్‌పీని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఖైరిగూడ ఓసీ వద్ద కొత్తగా నిర్మిస్తున్న ఇన్పిట్ క్రషర్ కన్వియర్స్‌ను ఆయన పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. పనుల వేగవంతం కోసం సింగరేణి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమలరావు, కేశవరావు, ఎస్ఈ(ఈఅండ్ఎం) ఖైరిగూడ పీఓ సత్యనారాయణ, ఫిట్ ఇంజనీర్ వీరన్న, ఈఈ(సివిల్) రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టీ)

మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకొని ఎంపీడీఓ రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు గ్రామ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిర్వహించే పారిశుద్ధ్యం, ఇతర అభివృద్ధి పనులకు ముందస్తుగా ప్రణాళిక బద్ధమైన కార్యాచరణతో మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో నిర్వహించుకున్నప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరు భాగస్వాములై తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈఓ కృష్ణమూర్తి గ్రామ అభివృద్ధి ప్రణాళిక అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ప్రతి ఏడాది గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుండి వచ్చే నిధులను ఏ విధంగా వినియోగించుకోవాలో ముందస్తుగా గ్రామసభలు నిర్వహించి, ప్రజల నుండి వచ్చే సలహాలు, సూచనలు తీసుకొని వారి సమక్షంలో రూపొందించిన అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నిధులను దుర్వినియోగం చేయకుండా అభివృద్ధికే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి సింగరేణి ఏరియాలో భద్రత విభాగంలో పని చేస్తున్న ఆర్ఎంజీ ప్రయివేటు సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఎస్‌జీవీపీ వరప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సంస్థ ద్వారా స్థానికులకు ఉద్యోగాలు వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎస్అండ్‌పీసీ సీనియర్ ఇన్స్‌పెక్టర్ రాజలింగు, జూనియర్ ఇన్స్‌పెక్టర్ చంద్రయ్య, రమేష్, మనోజ్, ఆర్ఎంజీ సెక్యూరిటీ మేనేజర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ జె.విజయ్‌కుమార్, వంగ రాజు, సతీష్, ప్రయివేటు ఆర్ఎంజీ సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ రామగోని మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని ర్యాలీ

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా మండలంలోని బంబారా గ్రామంలో బుధవారం అయోధ్య శ్రీరాముని ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు, గ్రామపటేల్ కొట్నాక దేవ్‌రావు, కొట్నాక నేపాజీ, ఆదివాసీ సంఘం నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఈ ర్యాలీ గ్రామంలో 22 వరకు కొనసాగుతుందన్నారు.

శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఫిబ్రవరి 19 ఛత్రపతి శివాజీ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, సెలవు రోజుగా ప్రకటించాలని ఆరెకుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చంకపురె శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరంలో తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌కు ఈ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని వినతిపత్రం అందజేసినట్టు, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా శివాజీ జయంతిని అధికారికంగా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా ఛత్రపతి శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, లేనిపక్షంలో ప్రతి మండలంలో ఆరెకుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

నవతెలంగాణ
మంచిర్యాల
4
గురువారం | జనవరి 18, 2024 | www.navatelangana.com

లారీ ట్రాన్స్‌పోర్టులను రద్దు చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్‌లో గిరిజనేతరుల లారీ ట్రాన్స్‌పోర్టలను రద్దు చేయాలని డిమాండ్ చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు అన్నారు. బుధవారం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో దేవాపూర్ పంచాయతీ కార్యదర్శి కవితకు వినతిపత్రం అందించారు. ఏజన్సీ గ్రామమైన దేవాపూర్‌లో గిరిజనేతరులకు లారీ ట్రాన్స్‌పోర్ట్‌లకు అనుమతులు ఎలా ఇచ్చారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ఉపాధ్యాక్షులు కనక గోవర్ధన్, సిడాం శంకర్, నాయకులు సిడాం రాందాస్, కేశవరావ్, గడ్డం భీమయ్య రొడ్డ రాంమోహన్, కుంరం జగ్గారావ్, కలవేణి శ్రావణ్ పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపర్చాలి

నవతెలంగాణ-తాండూర్

కార్మికుల వైద్య సదుపాయాల సౌకర్యార్థం బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేయడంతో పాటు సౌకర్యాలను మెరుగుపరచాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కోరారు. బుధవారం నాయకులతో కలిసి సింగరేణి ఎండీ బలరాంకు వినతిపత్రం అందించారు. కార్మికులు లేరన్న సాకుతో 250 బెల్లంపల్లి సింగరేణి ఆస్పత్రిని 50 పడకల వరకు కుదించారని తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో 900 మంది కార్మికులు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి వైద్య సౌకర్యాలను అందించడానికి ఆర్థో, ఫిజిషియన్, చిన్న పిల్లల వైద్య నిపుణులతో పాటు సిబ్బందిని నియమించాలని కోరారు. గోలేటి, మాదారం పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు, ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు కలిపించి డిస్పెన్సరీలను ఆధునికరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కౌన్సిల్ సిద్దంశెట్టి రాజమౌళి, పేరం శ్రీనివాస్, ప్రకాష్, మాధవ కృష్ణ, బి. సదానందం ఉన్నారు.

పల్లె అభివృద్ధికి కృషి : ఎంపీపీ



నవతెలంగాణ-బోథ్

పల్లెల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించే మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ నిధుల నుంచి రూ.4లక్షల నిధులతో మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి తనవంతుగా నిధులు కేటాయిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే మరిన్ని గ్రామాలతో పోలిస్తే అభివృద్ధిలో ఆదర్శంగా పాట్నాపూర్ గ్రామం నిలువడం జరిగిందని తెలిపారు. మునుముందు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామంలో ఇచ్చిన మాట ప్రకారం పూలాజీ బాబా మందిర్ నిర్మాణానికి రూ.1లక్ష భక్తులకు ఇవ్వడం జరిగిందన్నారు. మండల అభివృద్ధికి తన వంతుగా మరింత పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ, ఎంపీడీఓ సుశీల్ కూమార్‌రెడ్డి, ఎంపీటీసీ జుగాదిరావ్, పీఏసీఎస్ చైర్మెన్ ప్రశాంత్, ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతర తైబజార్ వేలం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర తైబజార్ వేలం పాటను బుధవారం ఉట్నూర్ ఆర్డీఓ జీవాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తైబజార్ వేలం రూ.7.25లక్షలు పలుకగా, ఎలక్ట్రిసిటీ రూ.1.28 లక్షలు, ప్యాలాలు రూ.44 వేలు, కొబ్బరి కాయల దుకాణానికి రూ.12 వేలు వేలం పాట నిర్వహించారు. వాహనాల పార్కింగ్ వేలం వాయిదా పడింది. ఈ వేలంలో స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఈఓ రాజమౌళి పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల రద్దుపై ఆరా

నవతెలంగాణ-కుభీర్

గతరెండు నెలల కింద మండలంలోని సిరిపెల్లి గ్రామానికి చెందిన పలువురు తహసీల్దార్‌కు మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏడుగురు వ్యక్తులకు సంబంధించిన కులధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని తహసీల్దార్ సోముకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారోనని తెలుసుకునేందుకు బుధవారం సిరిపెల్లి గ్రామానికి చెందిన జాదవ్ జీవన్ తహసీల్దార్ సోమును కలిసి ఆరా తీశారు. తహసీల్దార్ రెండు మూడు రోజుల్లో సమస్యను ఆర్డీఓకు వివరించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాములోరి అంక్షింతల వితరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాములోరి అంక్షింతల వితరణను బుధవారం మండలంలోని చిచ్‌ధరి, ఖానాపూర్ గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిచ్‌ధరి నుంచి మహిళలు నెత్తి మీద కలశాన్ని పెట్టుకుని భాజా, భజంత్రీలు మధ్య ఊరేగింపును నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా రామ నామ స్మరణలో మునిగి పోయారు. ఈ శోభయాత్ర రాధాకృష్ణ మందిరం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాష్, మాజీ సర్పంచ్ రామారావ్, పరశు రామ్ నాయక్, సోషల్ వర్కర్ అనిల్ రాథోడ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జన్నారం

మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన రవిందర్ రావ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణరాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరవుతారని, అదే విధంగా ఎంపీటీసీలు, సర్పంచులు తప్పకుండా హాజరు కావాలన్నారు. అధికారులు కూడా వారి ప్రగతి నివేధికలతో రావాలన్నారు.

పర్యాటక కేంద్రంగా చారిత్రక కట్టడం

నవతెలంగాణ-లింగంపేట్

చారిత్రక కట్టడమైన నాగన్న గారి బాయిని పర్యట కేంద్రంగా మారుస్తున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. లింగంపేట్ మండల కేంద్రంలోని నాగన్న గారి బావిని బుధవారం కలెక్టర్ సందర్శించారు. బావిలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను స్థానిక తహసిల్దార్ ఎంపీడీవోలతో కలిసి పరిశీలించారు. బావికి సంబందించిన చుట్టూ ప్రాంగణాన్ని కొలిపిచ్చి సరిహద్దులను వేయించారు. బావి పునరుద్ధరణ పనులు కూడా చాలావరకు పూర్తయినట్లుగా తెలిపారు. నాగన్న గారి బాయి సమీపంలోని పట్టేదారు మనోహర్ రావు తన సొంత భూమి నుండి 18 గంటల భూమిని నాగన్న గారి బాయికి అప్పగించారు. పురావస్తు శాఖ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చారిత్రక కట్టడమైనటువంటి నాగన్న గారి భాయి పునర్నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు. పర్యాటకులు ఆకర్షించే విధంగా రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో నాగన్న గారి భాయి ప్రత్యేక విశిష్టత ఉంటుందన్నారు. త్వరలో నాగన్న బావిని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోబోతుందని అన్నారు. ఆయన వెంట తాసిల్దార్ సుధాకర్, ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, లింగంపేట ఎస్సై ప్రభాకర్, ఎంపీఓ ప్రభాకర్ చారి, సర్వేయర్ మౌనిక, అభిలాష్, ఆర్ఐ బాలయ్య, వివిధ గ్రామాల పంచాయతీ సెక్రటరీలు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేద ప్రజల గొంతుక నవతెలంగాణ

నవతెలంగాణ-కామారెడ్డి

పేద ప్రజల గొంతుక 'నవతెలంగాణ' అని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ చాంబర్‌లో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన విషయాలను, వారి కష్టాలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువస్తూ వారి సమస్యల పరిష్కారానికి నవతెలంగాణ కృషి చేస్తుందన్నారు. ముమ్ముందు మరింత పేదల పక్షాన నిలబడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి నరేశ్, కామారెడ్డి విలేకరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి క్వార్టర్ల కబ్జా..!

- శ్రీనివాస్ నగర్ అడ్డా..!
- జోరుగా సింగరేణి క్వార్టర్ల స్థలాల్లో అక్రమ కట్టడాలు..!
- చోద్యం చూస్తున్న సింగరేణి ఎస్టేట్ అధికారులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లోని సింగరేణి క్వార్టర్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం మామూలైంది. శిథిలావస్థలోని ఖాళీ క్వార్టర్, సింగరేణి ఖాళీ స్థలం కనిపిస్తే చాలు క్వార్టర్లను ధ్వంసం చేసి అడ్డగోలుగా అక్రమ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలు సింగరేణి ఎస్అండ్ పీసీ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో విచ్చలవిడిగా నిర్మాణాలు చేస్తున్నారా..? లేక ముడుపులు తీసుకొని చూసి చూడనట్టు వవహరిస్తున్నారా..? అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్వార్టర్లను కూల్చి విశాలంగా ఇంటి నిర్మాణం చేసె వరకు చూస్తూ ఉండిపోవడం దేనికి సంకేతమని..? స్థానికులు చర్చించుకుంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా మందమర్రి డివిజన్‌లో జరుగుతున్న అవినీతి ఎక్కడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో మందమర్రికి చెందిన ఒక యూనియన్ నాయకుడు సింగరేణి క్వార్టర్‌ను కూల్చివేసి విశాలవంతమైన ఇల్లు కట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. ఈ విషయంపై గత జీఎం మనోహర్ రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవడంతో అతడిని అప్పటి ప్రభుత్వం బదిలీవేసి చేతులు దులుపుకుంది. గతంలో నవతెలంగాణ పత్రికలో ఇదే కాలనీకి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి సమీపంలోని సింగరేణి స్థలాన్ని ఫెన్సింగ్ వేసి కబ్జా చేసిన వార్త ప్రచురితమైంది. కానీ అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. అధికారులు ఇలా వ్యవహరిస్తే మరిన్ని అక్రమ కట్టడాలు చేసేందుకు మరి కొంతమంది సిద్ధమవుతున్నారనే సందేహం ప్రజల్లో ఉంది. ఈ వ్యవహారాలపై కిందిస్థాయిలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారా..? ఇటీవల ఎస్టేట్ విభాగంలో కొత్తగా నియామకం తర్వాతనే అక్రమ కట్టడాలు ఉపందుకున్నాయనే విమర్శలు సైతం వస్తున్నాయి. కోల్ బెల్ట్ ఏరియాలలో ఒక్క మందమర్రి డివిజన్‌లోనే ఇలాంటి అక్రమ నిర్మాణాలకు ఎవరు ప్రోత్సహిస్తున్నారు..? వారిని అడ్డుకునే ప్రయత్నం చేసే వారే లేరా..? ప్రస్తుత జీఎం వీటిపై చర్యలు తీసుకుంటారా..? లేక చూసిచూడనట్లు వదిలేస్తారా వేచి చూడాలి. అక్రమ నిర్మాణాలు శ్రీరాంపూర్, బెల్లంపెల్లి డివిజన్‌ల్లో ఎస్టేట్, జీఎంలు ఉక్కుపాదం మోపుతుంటే మందమర్రి డివిజన్‌లో మాత్రం ఎలాంటి చర్యలు లేవు.



ప్రధానమంత్రి పురస్కారాలకు దరఖాస్తులు

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

పాలనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగులకు అందించేందుకు ప్రధానమంత్రి పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం న్యూఢిల్లీ నుండి కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజాఫిర్యాదుల విభాగం సంయుక్త కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తన ఛాంబర్ నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాటగిరీ-1లో 12 ప్రాధాన్యత రంగాల క్రింద ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి 10 అవార్డులు, క్యాటగిరీ-2లో కేంద్ర, రాష్ట్ర, జిల్లాల వారీగా ఆవిష్కరణల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి 6 అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి పురస్కారాలు-2023లో హర్ ఘర్ జల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ / పట్టణ), మిషన్ ఇంద్రధనస్సు, జన ఆరోగ్య యోజన, ఉజ్వల, స్వనిధి, మాతృవందన, విశ్వకర్మ, ముద్ర, పోషణ్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు పథకాలలో సంపూర్ణ అభివృద్ధి సాధించిన సంబంధిత శాఖల అధికారులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 1 ఏప్రిల్ 2021 నుండి 31 జనవరి 2024 మధ్య కాలంలో చేసిన సేవలకు పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, సంస్థలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, జిల్లాల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 5 దశలలో దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. తుది దశలో పురస్కార గ్రహీతలను ప్రధానమంత్రి ఆమోదిస్తారని, ఈ నెల 31వ తేదీ లోగా అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి ప్రణాళికలు

నవతెలంగాణ-జైపూర్

గ్రామ, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికల తయారీలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరం అభివృద్ధి ప్రణాళికల తయారీపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామ, మండల స్థాయిలో అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకొని ఆర్థిక సామాజిక అత్యవసర సమస్యల పరిష్కారం దిశగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీకి సంబంధించి అభివృద్ధి ప్రణాళిక నిర్దేశిత గడువులోగా గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణకు సూచించారు. గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో నమోదుపై ఎంపీఓ అనిల్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమారంలో..

మండలంలోని దాంపూర్, కాజిపల్లి గ్రామపంచాయతీలలో స్థానిక సర్పంచుల అధ్యక్షతన బుధవారం గ్రామ అభివృద్ధి ప్రణాళికల తయారీపై అవగాహన కల్పించినట్లు స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్ రావు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధి సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతుల కల్పన కోసం అవసరాల దృష్ట్యా ప్రణాళికలు తయారు చేయాలని స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ అవసరమైన మేరకు అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల వారీగా తయారు చేసే ప్రణాళికల్లో ప్రభుత్వ శాఖ సంబంధించి అధికారులు, గ్రామపంచాయతీ ప్రజలు భాగస్వామ్యం కల్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోదారి రమాదేవి

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, రవాణ శాఖ అధికారులు

నవతెలంగాణ-నస్పూర్

వాహనదారులు, పాదచారులు రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి లెక్కల కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు-2024 బ్యానర్లు, గోడప్రతులు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయవచ్చని, ప్రమాదాలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 15 నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు, ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాలను రక్షిస్తుందని తెలిపారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడుపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరామన్నారు. ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేసే ఆటోలు, జీపులు ఇతర ప్రైవేట్ రవాణా వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లదన్నారు. నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రవాణ శాఖ, కార్యాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన నూతన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ గౌస్ ఆలం బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.శివరాం ప్రసాద్‌ను కలిశారు.

తెలంగాణ జూడో క్రీడాకారుడికి రజత పతకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో జరుగుతున్న 67వ నేషనల్ ఎస్జీఎఫ్ గేమ్స్ అండర్-19 జూడో పోటీలలో ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ పూర్వ విద్యార్థి లక్ష్మణ్ జూడో క్రీడాకారుడు బుధవారం రజత పతకం కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం స్థానిక విద్యార్థి జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూడో శిక్షణ పొందుతున్నాడు. ఈ మేరకు ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

సిని టివి రంగాలపై ఔత్సాహికులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు టీవీ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో ఈనెల 20న మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా సాంస్కృతిక సమాఖ్య చీఫ్ కోఆర్డినేటర్ హనుమాండ్ల మధుకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ సినీ టీవీ దర్శకులు, నిర్మాత, తెలుగు టెలివిజన్ ఫెడరేషన్ స్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ శిక్షణ శిబిరంలో ప్రముఖ సిని దర్శకులు వి.ఎన్ ఆదిత్య, ప్రేమ్‌రాజ్, నెల్లుట్ల ప్రవీణ్ చంద్ర, చంద్ర మహేష్, ప్రముఖ రచయిత తోటపల్లి సాయినాథ్, యువ దర్శకులు మానస్ దండనాయక, స్క్రీన్ ప్లే రచయిత శ్రీశైల మూర్తి తదితరులు పాల్గొని శిక్షణ ఇస్తారన్నారు. సినీ, టీవీ రంగంలో రాణించాలనే వారికి మూల కథ, సన్నివేశ ప్రాధాన్యత, పాత్రల రూపకల్పన, ప్రారంభ, ముగింపు సన్ని వేషాలు ఇలా 24 శాఖలపై అవగాహన, స్క్రీన్ ప్లే తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని వారు పేర్కొన్నారు. జిల్లాలోని ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం అభినవ సంతోష్ కుమార్ 8074771108, హనుమాండ్ల మధుకర్ 9908232303 సంప్రదించాలని కోరారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి హజరవుతారని తెలిపారు.

ఏఐటీయూసీ కృషితోనే రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా

నవతెలంగాణ-కాసిపేట

ఏఐటీయూసీ కృషితో సింగరేణి రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, పీఎల్ఆర్ బోనస్, వేజ్‌బోర్డ్ ఏరియల్స్ సాధించడం జరిగిందని ఆ సంఘరీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యాక్షులు బియ్యాల వెంకటస్వామి, సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యంపై ఏఐటీయూసీ ఒత్తిడి చేయడంతో రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా 32 శాతం ఈ నెల 19న, పీఎల్ఆర్ బోనస్ ఈ నెల 21న, వేజ్‌బోర్డ్ ఏరియల్స్ ఫిబ్రవరి 6న చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రావాల్సిన బకాయిలను ఇప్పించడంలో ఏఐటీయూసీ ముందందన్నారు.

20 నుంచి ఫోటో ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక శిబిరాలు

నవతెలంగాణ-నస్పూర్

స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపులకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 20, 21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8 ఫిబ్రవరి 2024 వరకు నిర్వహించనున్న ఫొటో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం సమర్థవంతంగా చేపడుతున్నామన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితా సవరణలపై ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. నూతన ఓటరు నమోదు, సవరణ, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6, 7, 8 దరఖాస్తు ఫారములు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

జనవరిలోనే విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి విశ్రాంత కార్మికులకు సంబంధించిన బెనిఫిట్స్ జనవరి మాసంలో సింగరేణి యాజమాన్యం చెల్లించని ఉందని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్ సింగరేణి కార్మికుల ఏరియస్ వాట 32శాతం ఈనెల 19న, లాభాల బోనస్ నగదు ఈనెల 21న యాజమాన్యం చెల్లించనున్నట్లు తెలిపారు. 11వ వెజ్ బోర్డ్ ఏరియస్ ఫిబ్రవరి 6న కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు.